క్లుప్తంగా

1న నరసింహ స్వామి కల్యాణం

అద్దంకి: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శింగరకొండలోని కొండపైనున్న క్షేత్రాధిపతి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి కళ్యాణాన్ని వచ్చే నెల 1వ తేదీన నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కల్యాణాన్ని స్వామి వారి జన్మనక్షత్రం స్వాతి నక్షత్ర సందర్భంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కళ్యాణ కార్యక్రమంలో పాల్గొనదలిచిన వారు రూ.1,116 ఆలయంలో చెల్లించి పాల్గొనవచ్చునని తెలిపారు. కళ్యాణంలో పాల్గొన్న దంపతులకు స్వామివారి శేష వస్త్రాలు, ప్రసాదం పంపిణీ చేస్తామని తెలిపారు. వచ్చే నెల 15వ తేదీన వరలక్ష్మీ వ్రతం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ వ్రతంలో పాల్గొనదలచిన మహిళా భక్తులు ఆ రోజు ఉదయం 9 గంటలకు ఆలయం వద్దకు రావాలని కోరారు.

లక్ష్యంతో ముందుకు సాగాలి


మాట్లాడుతున్న నరసింహారావు

సంతమాగులూరు(అద్దంకి): విద్యార్థులంతా ఒక లక్ష్యంతో ముందుకు సాగినప్పుడే వారు భవిష్యత్తు బాగుంటుందని పర్సనాలిటీ డెవలప్‌మెంట్ ట్రైనర్ గోగులపాటి నరసింహారావు అన్నారు. సంతమాగులూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని విద్యార్థులకు మంగళవారం పర్సనాలిటీ డెవలప్‌మెంట్, స్కిల్స్, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ శివ నాగలక్ష్మి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ నిర్దేశిత లక్ష్యాన్ని కలిగి ఉండాలని చెప్పారు. దీంలో భాగంగా ఒత్తిడి రహిత విద్యను అందించాలని చెప్పారు.

రాతి ముఖ మండప నిర్మాణానికి విరాళం

అద్దంకి: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థాన ముఖమండప నిర్మాణానికి దాతలు విరివిగా విరాళాలు ఇస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం పట్టణానికి చెందిన వేమల వేణుబాబు, శివకుమరి దంపతులు రూ.1,05,116ను ఆలయ ఏసీ తిమ్మనాయుడికి అందజేశారు.

వైదనలో పెరిగిన ఆలయ భూముల కౌలు

బల్లికురవ: మండలంలోని వైదన గ్రామంలో చెన్నకేశవ స్వామి రామలింగేశ్వర స్వామి ఆలయ భూములకు బుధవారం కౌలు వేలం నిర్వహించారు. రామలింగేశ్వర స్వామి ఆలయ భూములు 14.40 ఎకరాలకు గత ఏడాది రూ.1.78లక్షలు పలకగా ఈ ఏడాది రూ.2,12,500కు రైతులు కౌలు వేలంలో దక్కించుకున్నారు. చెన్నకేశ స్వామి ఆలయ భూములు 6.25 ఎకరాలకు గత ఏడాది రూ.1.19 లక్షలు పలుకగా ఈఏడాది రూ.1.70 లక్షలు పలికింది. పెరిగిన కౌలు ప్రకారం మూడు సంవత్సరాలు తమకు కౌలు కేటాయించాలని దేవాదాయ శాఖ అధికారులకు రైతులు తెలిపారు. అద్దంకి ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరావు, ఈవోలు బి. కృష్ణారెడ్డి, చావా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రుణాలు చెల్లించేలా చర్యలు చేపట్టండి

చీరాల టౌన్: రుణాలు తీసుకున్న పొదుపు గ్రూపులు తిరిగి సకాలంలో చెల్లించేలా వీఓఏలు చర్యలు తీసుకోవాలని ఏపీఎం మధుసూదన రావు సూచించారు. బుధవారం బుర్లవారిపాలెం లోని స్త్రీశక్తి భవన్‌లో మండలంలోని వీఓఏలకు ఒకరోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఏపీఎం సుబ్బారావు మాట్లాడుతూ మండలంలో ఉన్న పొదుపు గ్రూపుల వద్దకు వీఓఏలు నెలకు ఒకసారి సమావేశాన్ని నిర్వహించి గ్రూపుల ప్రగతిని తెలుసుకోవాలన్నారు. పొదుపు మహిళల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు.

ఘనంగా స్నేహితుల దినోత్సవం

అద్దంకి రూరల్: రోటరీక్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో స్థానిక రోటరీ ఆధ్వర్యంలో బుధవారం అంతర్జాతీయ సేహితుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ సభ్యులు ఒకరికొకరు ఫ్రెండ్‌షిప్ బ్యాండ్‌లను కట్టుకున్నారు. రోటరీ అధ్యక్షుడు బాచిన పూర్ణ చంద్రరావు, కార్యదర్శి ఏ. హరిప్రసాద్, దేవపాలన, చప్పిడి వీరయ్య, అంజాద్ బాషా, లక్షారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



గూడ్స్ రైలు కిందగా దూరి వెళుతున్న మహిళలు

ప్రాణాలతో చెలగాటం..!

- ప్రమాదమని తెలిసినా ఆగి ఉన్న రైలు నుంచి దాటుతున్న ప్రజలు
- వేటపాలెం రైల్వే స్టేషన్ వద్ద నిత్యకృత్యం
- తరచూ చోటు చేసుకుంటున్న ప్రమాదాలు


గూడ్స్ రైలు మధ్య నుంచి ఎక్కి దాటుతున్న యువకులు

వేటపాలెం: ప్రజలకు ప్రమాదాలంటే లెక్కలేకుండా పోతోంది. ప్రాణాలు పోతున్నా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఆగి ఉన్న రైలు కింది నుంచి దాటుకుంటూ ప్రమాదాలతో ఆటలాడుకుంటున్నారు. వేటపాలెం రైల్వే స్టేషన్ లూప్ లైన్‌లో తరచూ గూడ్స్ రైళ్లను నిలుపుతున్నారు. ఎక్స్‌ప్రెస్ వంటి రైళ్లు వెళ్లి పోవడానికి గూడ్స్, పాసింజర్ రైళ్లను ఇక్కడ నిలిపివేస్తుంటారు. స్టేషన్ పడమర వైపున అంబేడ్కర్ కాలనీతో పాటు నాలుగు కాలనీలున్నాయి. ఒక గురుకుల పాఠశాల ఉంది. ఈ కాలనీలకి చెందిన ప్రజలు ఎటువంటి పనికైనా స్టేషన్ దాటుకొని తూర్పు వైపు ఉన్న వేటపాలెం సెంటర్‌కి రావాల్సి ఉంటుంది. కాలనీకి చెందిన చదువుకొనే పిల్లలు సైతం నిత్యం వేటపాలేనికి వచ్చి పాఠశాలల్లో చదువుకొని తిరిగి సాయంకాలానికి స్టేషన్ అవతల వైపు తమ కాలనీలకు చేరుకుంటుంటారు. గ్రామాల్లోని ప్రజలు పంట పొలాలకు వెళ్లడానికి రైతులు వ్యవసాయ కూలీలు స్టేషన్ దాటుకుని వెళ్లాల్సి ఉంది. ఎక్కువ సమయంలో లూపు లైన్‌లో రైళ్లు నిలిపివేసే సమయంలో ప్రజలు నిలిపి ఉన్న రైలు కింద నుంచి దూరడం.. పై నుంచి ఎక్కి అవతల వైపునకు వెళ్లడం చేస్తున్నారు. దీంతో రెండో వైపు నుంచి వచ్చే రైళ్లను చూడకపోవడంతో తరచూ ప్రమాదాలకు లోనవుతున్నారు. రైళ్లు దాటే సమయంలో ఆకస్మాత్తుగా కదలడం వల్ల గాయాలపాలవుతున్నారు. అధికారులు స్పందించి ప్రమాదాలు నివారణకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

ఫుట్ ఓవర్ బ్రిడ్జితో పరిష్కారం..

రైల్వే స్టేషన్ తూర్పు వైపు నుంచి స్టేషన్ అవతల పడమర వైపు ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాంచాల్సి ఉంది. ఈ విధంగా ఫుట్ ఓవర్ బ్రిడ్జిని ఏర్పాటు చేయడం ద్వారా గ్రామం నుంచి స్టేషన్ పడమర వైపు కాలనీకి వెళ్లే ప్రజలకు, విద్యార్థులు, రైతులు, వ్యవసాయ కూలీల రాకపోకలకు ఉపయోగంగా ఉంటుందని ప్రజలు కోరుతున్నారు. అధికారులు అటువైపుగా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

మోసం చేయడం బాబు నైజం


చీరాల: 2వ వార్డులో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న పార్టీ నాయకులు


పర్చూరులో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

చీరాల: ప్రజలను మోసగించడం చంద్రబాబు నైజమని, అమలు కాని హామీలు గుప్పించి వాటిని అమలు పరచకుండా ప్రజలను మభ్యపెడుతున్నారని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు యాతం మేరిబాబు అన్నారు. బుధవారం 2 వ వార్డులో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ ఆదేశాల మేరకు కార్యక్రమాన్ని నిర్వహించారు. సూపర్ సిక్స్ పేరుతో ఎన్నికల ముందు ఎన్నో పథకాలు ప్రకటించి ఎన్నికల తర్వాత వాటిని అమలు చేయకుండా మోసం చేస్తున్నారన్నారు. సంక్షేమ పథకాల నగదును నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేశామన్నారు. అటువంటి సుపరిపాలన అందించిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అనంతరం క్యూర్ కోడ్ ఆవిష్కరించారు. జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు, వాసిమళ్ళ వాసు, కంకణాల రంగయ్య, సంగం కోటయ్య, బొందు ప్రసాద్, కొండూరి చిన్న, రాజా పాల్గొన్నారు.

కూటమి మోసాలను తెలుసుకోండి

పర్చూరు(చినగంజాం): కూటమి ప్రభుత్వ మోసాలను ప్రజలందరూ తెలుసుకోవాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కఠారి అప్పారావు అన్నారు. బుధవారం పర్చూరు నియోజక వర్గ ఇన్‌చార్జ్ గాదె మధుసూదన రెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని గర్నెపూడి, ఏడారిపల్లి, చెన్నుబొట్ల అగ్రహారంలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ కార్యక్రమం మండల కన్వీనర్ కఠారి అప్పారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంతరావూరు(చినగంజాం): సంతరావూరులో బుధవారం రాత్రి మండల పార్టీ కన్వీనర్ మున్నం నాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. కూటమి ప్రభుత్వ మోసపు హామీలను గురించి ఇంటింటికి తిరిగి వివరించారు. వైస్ ఎంపీపీ కాటుకూరి బాబురావు, కో ఆప్షన్ సభ్యుడు మహ్మద్ షా, కేవీ సుబ్బారావు చౌదరి, కొల్లాటి ఏడుకొండలు, పాదర్తి ప్రకాష్, వీవీ రామప్రసాద్, ఎంవీ రామారావు, రామకృష్ణ, ఎస్. సుబ్బారెడ్డి, యోహాను, మోహన రావు, సుందరరావు, సురేష్, రమేష్,.బీ దానియేలు, రమణయ్య, వి. సుబ్బారావు, పి. నాగిరెడ్డి, రాఘవరాజు, ఉమాశంకర్, సూర్యనారాయణ, వాటుపల్లి బలరాం,షేక్ కరిముల్లా,వీ శ్రీరాములు రెడ్డి, షేక్ రెహమాన్, రామకోటి, పఠాన్ సైదా పాల్గొన్నారు.


సంతరావూరులో ప్రజలకు కూటమి ప్రభుత్వ మోసాలను వివరిస్తున్న నాయకులు

అదుపు తప్పిన కారు

మార్టూరు: జాతీయ రహదారిపై టైరు పగిలి కారు అదుపుతప్పండంతో ఓ వ్యక్తి స్వల్పంగా గాయపడిన సంఘటన మార్టూరు ఫ్లెక్లైవర్‌పై బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. విజయవాడకు చెందిన శ్రీధర్, రామారావు కారులో తిరుపతి నుండి విజయవాడ వెళుతున్నారు. మార్టూరు ఫ్లెక్లైవర్‌పై బుధవారం సాయంత్రం వీరి కారు వెనక టైరు పగలడంతో కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీ కొని రహదారికి అడ్డంగా నిలిచిపోయింది. ప్రమాదంలో రామారావు స్వల్పంగా గాయం కావడంతో పక్కనే ఉన్న ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

యువకుడు ఆత్మహత్యాయత్నం

బల్లికురవ: బ్రిక్స్ పరిశ్రమలో పనిచేసే యవకుడు ఎలుకల మందు తిని ఆత్మహత్యాత్నం చేశాడు. ఈ ఘటన బుధవారం మండలంలోని రామాంజనేయపురం గ్రామ సమీపంలో జరిగింరి. కొణిదెన గ్రామానికి చెందిన చలంచర్లాది ఆరు నెలలుగా బ్రిక్స్ పరిశ్రమలోపనిచేస్తూ అక్కడే కాపురం ఉంటున్నాడు. మధ్యాహ్న సమయంలో ఇంట్లో ఎవరూ లేకుండాచూసి ఎలుకల మందు తిన్నాడు. 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తలరించారు. ఆత్మహత్యాయత్నానికి కారణాలు తెలియరావాల్సి ఉంది.

పీహెచ్‌సీల్లో ప్రసవాలు పెంచాలి

కారంచేడు: జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నార్మల్ డెలివరీలను పెంపొందించేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని బాపట్ల డీఎంహెచ్ఓ డాక్టర్ విజయమ్మ అన్నారు. బుధవారం కారంచేడు పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్య సేవలు, పరీక్షలపై ప్రజల్లో చైతన్యం కల్పించాలన్నారు. వాతావరణ పరిస్థితులను బట్టి గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాల్లో వైరల్ వ్యాధులు సోకకుండా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలన్నారు. డాక్టర్ గోరంట్ల సురేష్‌బాబు, డాక్టర్ పృథ్వీరాజ్, సూపర్‌వైజర్ శ్రీనివాసరావు, ల్యాబ్‌టెక్నీషియన్ సుబ్బారావు, ఫార్మసిస్ట్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయండి

చీరాల టౌన్: ప్రజలకు ఉన్న రెవెన్యూ సమస్యల పరిష్కారంలో రెవెన్యూ ఉద్యోగులు, సిబ్బంది అలసత్వం వహించకుండా నిబద్ధతతో పనిచేయాలని తహసీల్దార్ కుర్రా గోపీకృష్ణ సూచించారు. బుధవారం రెవెన్యూ కార్యాలయంలోని సమావేశపు హాలులో రెవెన్యూ ఉద్యోగులతో తహసీల్దార్ సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలోని రెవెన్యూ గ్రామాల వారీగా పెండింగ్‌లో ఉన్న అర్జీలను త్వరగా విచారణలు చేసి ప్రజల సమస్యలను పరిష్కరించాలన్నారు. రెవెన్యూ ఉద్యోగులు ప్రజలతో సత్సంబంధాలు కలిగి జవాబుదారీగా పనిచేయాలన్నారు. ప్రభుత్వం అందించే రెవెన్యూ సేవలను అందరికీ అందించాలని కోరారు. భూసమస్యల అర్జీల విచారణ నిష్పక్షపాతంగా చేయాలన్నారు. డీటీ సుశీల, మండల సర్వేయర్ బసవాచారి, ఆర్ఐలు శేఖర్, సత్యం, వీఆర్వోలున్నారు.

ఘనంగా పెన్షన్ పితామహుని వర్ధంతి


నకారకు పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న విశ్రాంత ఉద్యోగులు

అద్దంకి: పెన్షన్ పితామహుడు నకారా వర్ధంతి పట్టణంలో మంగళవారం ఘనంగా నిర్వహించినట్లు బుధవారం తెలిపారు. రిటైర్డ్ ఉద్యోగుల భవనంలో రిటైర్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. సంఘ అధ్యక్షుడు అడుసుమల్లి అనంతకోటేశ్వరరావు అధ్యక్షత వహించారు. దానిలో భాగంగా నకారా చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. నకార పెన్షన్ ఉద్యమంతో లక్షలాది మంది ఉద్యోగుల కుటుంబాల్లో వెలుగులు నింపారన్నారు. విశ్రాంత ప్రిన్సిపాల్ ఎస్. శంకరారెడ్డి సంఘానికి రూ.25వేల విలువైన కంప్యూటర్ అందజేశారు. సంఘానికి విశేషంగా సహకరించిన వారిని ఘనంగా సన్మానించారు. పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, దేవపాలన, జ్యోతి చంద్రమౌళి, రిటైర్ ఉద్యోగ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

కార్మిక పోరాటాలతోనే విజయం


విజయోత్సవం నిర్వహిస్తున్న కార్మికులు

చీరాల అర్బన్: నెల్లూరు నగరపాలక సంస్థలో కార్మిక పోరాట విజయం పట్ల సీఐటీయూ చీరాల నాయకులు బుధవారం హర్షం వ్యక్తం చేశారు. సీఐటీయూ చీరాల అధ్యక్షుడు ఎన్.బాబూరావు మాట్లాడుతూ నెల్లూరులో పారిశుద్ధ్య పనులు ప్రైవేటు కాంట్రాక్టులకు ఇచ్చే టెండర్లు రద్దు చేయాలని, పారిశుద్ధ్య కార్మికులు గత 14 రోజులుగా నిరవధిక సమ్మె నిర్వహించారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల పోరాటానికి దిగివచ్చి ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, నగరపాలక సంస్థ కమిషనర్ వై.నందన్ ద్వారా ప్రయోగాత్మకంగా ప్రారంభించిన టెండర్‌ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారన్నారు. ఆప్కాస్‌ను కూడా యథావిధిగా కొనసాగిస్తామని ప్రకటించడం కార్మిక విజయమేనన్నారు. ఇంజినీరింగ్ కార్మికుల జిల్లా కన్వీనర్ చిమటా వీరాస్వామి, జి.ఇమ్మానియేలు, ఎండ్లూరి సింగయ్య, గేరా క్రాంతిసాగర్, కోటేశ్వరమ్మ, బి.కుమారి, యశోద పాల్గొన్నారు.

క్షయ నిర్మూలనే లక్ష్యం


నాగులపాలెంలో మాట్లాడుతున్న డాక్టర్ గౌతమ్

నాగులపాలెం (కారంచేడు): సమాజం నుంచి క్షయ వ్యాధిని తరిమికొట్టేందుకు ప్రజలతో పాటు, వైద్య సిబ్బంది ప్రత్యేక కృషి చేయాలని డాక్టర్ ఎం. గౌతమ్ అన్నారు. బుధవారం నాగులపాలెం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు క్షయ వ్యాధి లక్షణాలు, లక్షణాలుంటే ఎలాంటి పరీక్షలు చేయించుకోవాలి, టీబీని అరికట్టేందుకు ఏ మందులు వాడాలో ఆయన వివరించారు. ప్రధాన మంత్రి టీబీ ముక్తభారత్ కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులకు, విద్యార్థులకు వ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రెండు వారాలకు మించి దగ్గు ఉంటే వెంటనే సమీప ఆసుపత్రిలో పరీక్షలు చేయించుకోవాలన్నారు. జ్వరం తరచుగా రావడం, సాయంత్రం సమయాల్లో చెమటలు పట్టడం, ఛాతీలో నొప్పి, ఆయాసం, బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉంటే తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలన్నారు. ముందుగా ఎక్సరే తీయించి దాని ఆదారంగా కళ్ళె పరీక్షలు చేయించాలన్నారు. బాపట్ల జిల్లా టీబీ ల్యాబ్ సూపర్‌వైజర్ టి. నరేంద్ర, ఫీల్డు కోఆర్డినేటర్ ఎన్. నీలిమ, సౌజన్య, వెన్నెల, వైద్య సిబ్బంది, ఆశాలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో ప్రమాణాలు తప్పనిసరి


పెదగంజాంలో పనులు పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ ఎంపీడీఓ పూర్ణచంద్రరావు

చినగంజాం: ఉపాధి హామీ పనుల నిర్వహణలో ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సీహెచ్ పూర్ణచంద్రరావు అన్నారు. బుధవారం పెదగంజాం గ్రామ పంచాయతీ పరిధిలో నిర్వహిస్తున్న ఉపాధి హామీ పనులను, పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఉపాధి హామీకి సంబంధించి మస్టర్‌లు తప్పనిసరిగా నమోదు చేయాలని, పనుల సమయాలను తప్పనిసరిగా పాటించాలని, కొలతల ప్రకారం పనులు చేయాలని సూచించారు. అనంతరం పెదగంజాం గ్రామంలో పారిశుద్ధ్య పనులను పరిశీలించి పంచాయతీ సిబ్బంది చెత్త తొలగించే తీరును పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యదర్శి కృపారావు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత


స్టడీమెటీరియల్ అందుకుంటున్న విద్యార్థులు

వేటపాలెం: స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల్లో పదో తరగతి చదువుతున్న 150 మంది విద్యార్థులకు స్టడీమెటీరియల్‌ను పంపిణీ చేసినట్లు హెచ్ఎం దేవర కొండ సరోజిని బుధవారం తెలిపారు. స్టడీమెటీరియల్‌ను పాఠశాల ఉపాధ్యాయులు ఉమ్మిటి వేణుగోపాలరావు, అవ్వారు సుజాత, వి. జయంతి ఉచితంగా అందజేసినట్లు హెచ్ఎం తెలిపారు. విద్యాశాఖ రూపొందించిన బ్లూప్రింట్ ఆధారంగా తయారు చేశారని.. ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా చదువుకొని మంచి మార్కులు సాధించాలన్నారు.

అపరిచిత వ్యక్తులతో జాగ్రత్త


విద్యార్థులతో మాట్లాడుతున్న న్యాయవాదులు

అద్దంకి రూరల్: పరిచయంలేని వ్యక్తులతో బాలబాలికలు అప్రమత్తంగా ఉండాలని బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు వై. శ్రీనివాసరావు అన్నారు. బుధవారం మనుషుల అక్రమ రవాణా దినోత్సవం సందర్భంగా స్థానిక రాజీవ్ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి సీనియర్ న్యాయవాది కరిరామయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మాట్లాడుతూ పరిచయం లేని వ్యక్తులు ఇచ్చే ఆహార పదార్థాలు తీసుకోవద్దని హెచ్చరించారు. తల్లిదండ్రులకు ఏమైనా న్యాయ సమస్యలు ఉంటే మండల న్యాయసేవాధికార సంస్థను సంప్రదించాలన్నారు. న్యాయవాదులు మారుతా శ్రీను, ఎస్కే మహమ్మద్ రఫీ, పాల్గొన్నారు.

శక్తి యాప్‌తో సంపూర్ణ రక్షణ

కారంచేడు: నేటి సమాజంలో బాలికలపై జరుగుతున్న ఘోరాలను అరికట్టేలా బాలికలు అప్రమత్తంగా వ్యవహరించాల్సి ఉందని కారంచేడు ఎస్ఐ షేక్ ఖాదర్‌బాషా, చీరాలకు చెందిన శక్తి టీం ఇన్‌చార్జ్ ఎస్ఐ ఎ. హరిబాబు అన్నారు. బుధవారం మండల కేంద్రమైన కారంచేడు యార్లగడ్డ నాయుడమ్మ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్ఐలు బాలబాలికలకు అనేక విషయాలపై అవగాహన కల్పించారు. బాపట్ల ఎస్పీ తుషార్‌డూడీ ఆదేశాల మేరకు చీరాల డీఎస్పీ మొయిన్ సూచనలతో చీరాల సబ్ డివిజన్ పరిధిలో శక్తిటీం నిరంతరం పని చేస్తుందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో బాలబాలికల చేతుల్లో సెల్‌ఫోన్‌లు ఉంటున్నాయని, వాటిని అవసరమైన మేరకు మాత్రమే వినియోగించాలన్నారు. సెల్‌ఫోన్‌లల్లో వచ్చే ప్రమాదకమైన యాప్‌లను ఆపరేట్ చేయడం వలన ఎన్నో అనర్థాలున్నాయన్నారు. వాటిని పొరపాటుగా వాడటం వలన బాలికల ఫేస్‌లను అసభ్యకరమైన ఫొటోలుగా మార్చి వాటిని నెట్‌లో పెట్టే ప్రమాదముందన్నారు. అలాగే బాలికలు ఆపదలో ఉన్న సమయంలో ప్రభుత్వం నియమించిన శక్తి యాప్‌ను వినియోగించుకోవాలన్నారు. ఈ యాప్‌పై బాలికలు సరైన అవగాహన కలిగి ఉండాలన్నారు. బాలికలతోనే పాఠశాలలో ఒక టీంను ఏర్పాటు చేశారు. ప్రధానోపాధ్యాయురాలు ఎన్. సామ్రాజ్యం, శక్తి టీం సభ్యులు లోకేష్, సుబ్బారావు, సునీత, వరలక్ష్మి పాల్గొన్నారు.


పర్చూరు: అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ జీవీచౌదరి


కారంచేడులో బాలికలకు అవగాహన కల్పిస్తున్న శక్తిటీం ఇన్‌చార్జ్ హరిబాబు, ఎస్ఐ ఖాదర్‌బాషా

బ్యాంక్‌ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

మండలంలోని అన్ని బ్యాంక్‌ల వద్ద సంబంధిత అధికారులు తప్పకుండా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని ఎస్ఐ ఖాదర్‌బాషా అన్నారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో అన్ని బ్యాంక్ అధికారులతో సమావేశం నిర్వహించారు. సైబర్ క్రైంతో పాటు, వివిధ రకాల లావాదేవీలలో అవకతవకలు జరగకుండా ఉండేందుకు వీలుగా సీసీ కెమెరాల పర్యవేక్షణ అవసరమన్నారు.


కారంచేడు పీఎస్‌లో బ్యాంక్‌లో మాట్లాడుతున్న ఎస్ఐ ఖాదర్‌బాషా

పర్చూరు(చినగంజాం): విద్యార్థి దశలో చదువుపై దృష్టి సారించాలని మత్తు పదార్థాల జోలికి వెళ్ళకుండా జాగ్రత్త వహించాలని పర్చూరు ఎస్ఐ జీవీ చౌదరి అన్నారు. బుధవారం నాగులపాలెంలోని గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు మత్తు పదార్థాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మత్తు పదార్థాలు, మద్యం వంటి దుర్వ్యసనాలకు విద్యార్థులు లోను కాకుడదని, పూర్తిగా చదువుపై దృష్టి సారించాలన్నారు. సైబర్ క్రైం పట్ల జాగ్రత్త వహించాలని, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాం వంటి వాటిని దుర్వినియోగం చేయకుండా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ట్రైనింగ్ ఎస్ఐ పులి గోపి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



